ఎట్టకేలకు మోక్షం!

- జిల్లా కేంద్రంలో అమల్లోకి వచ్చిన సర్క్యులేషన్ ప్యాట్రన్
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రూపకల్పన
- ఇకపై ఇరుకు వీధుల్లో స్థలం నిబంధన మినహాయింపు

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలో సామాన్య, పేద ప్రజలకు తీపికబురు అందింది. పదిహేను అడుగుల లోపు రోడ్డు ఉన్న ప్రాంతాల్లో ఇంటి ముందు పది అడుగులు స్థలం వదలనవసరం లేదనే నిబంధనను అమలు చేస్తూ రూపొందించిన సర్క్యులేషన్ ప్యాట్రన్‌కు సుమారు ఏడాదిన్నర తర్వాత మోక్షం లభించింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మదిలో వచ్చిన ఆలోచన పేద ప్రజలకు ఉపయోగకరం కానుంది. అప్పట్లోనే ఇది కార్యరూపం దాల్చాల్సి ఉన్నా కొందరు అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా పెండింగ్‌లో పడిపోయింది. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత దీన్ని అమలు చేస్తారని భావించినా కుంటి సాకులతో ఇన్నాళ్లూ జాప్యం చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు ఆమోదం లభించడంతో తక్కువ స్థలం కలిగిన పేదలకు లబ్ధి చేకూరనుంది. ఇటీవలే సర్క్యులేషన్ ప్యాట్రన్‌కు ఆమోదం లభించగా ఐదు రోజులుగా ప్లాన్లు అప్‌లోడ్ చేస్తూ పరిశీలించారు. ఇది విజయవంతం కావడంతో ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. కాగా, సర్క్యులేషన్ ప్యాట్రన్ మంచి ఆలోచన అని భావించిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కూడా అమలు చేయాలని నిశ్చయించినట్టు సమాచారం. ఏది ఏమైనా పేద ప్రజలకు ఉపయోగపడే సర్క్యులేషన్ ప్యాట్రన్ అమల్లోకి తీసుకువచ్చిన ఘనత మాత్రం వైఎస్సార్ సీపీకి దక్కుతుందనడంలో సందేహం లేదు.


పదిహేను అడుగులు లోపు రోడ్డు ఉన్న ఓ వీధి

ప్లాన్లను అనుమతిస్తాం..



పదిహేను అడుగులు లోపు రోడ్డు ఉన్న ప్రాంతాల్లో ఇంటి ముందు స్థలం వదలకుండానే నిర్మాణానికి అనుమతిస్తాం. ఇందుకు గానూ ప్రభుత్వం సర్క్యులేషన్ ప్యాట్రన్‌కు ఆమోదం తెలిపింది. అటువంటి ప్రాంతాల్లో స్థలాలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పి.వి.డి.ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం నగర పాలక సంస్థ

ధ్యానంతో మానసిక ప్రశాంతత


శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న అభ్యాసకులు


ఆకట్టుకున్న సంప్రదాయం చిన్నారుల ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వక్తలు పేర్కొన్నారు. పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు శాకాహార ర్యాలీ నిర్వహించారు. అభ్యాసకులు హాజరై నినాదాలు చేశారు. అనంతరం మహా కరుణ అహింసా ధ్యాన యజ్ఞంలో భాగంగా సామూహికంగా ధ్యానం చేశారు. ఈ సందర్భంగా స్పిరిట్యువల్ ట్రస్టు చైర్మన్ కె.విజయభాస్కర రెడ్డి, నేషనల్ పిరమిడ్ వెజిటేరియన్ మూమెంట్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ వల్లూరి శివనాగకృష్ణ మాట్లాడుతూ శాకాహారం తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిఒక్కరూ అహింసామార్గంలో పయనించాలన్నారు. అనంతరం సంప్రదాయం గురుకులం విద్యార్థులు డైరెక్టర్ స్వాతి సోమనాథ్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో హైదరాబాద్ పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి మారం శివప్రసాద్, బి.కె.శారద, శ్రీకాకుళం సభ్యులు ఎస్.బాలాజీరావు, కె.శివ, రామారావు, బిందుమాధవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని డీఆర్‌వలసలో ఆదివారం మాట్లాడారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపట్టి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం సాధ్యం కాదని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలైనా పేదల కోసం ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదని, ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమన్నారు. నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం హయాంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను అందించామన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజాపక్షాన పోరాటాలు చేయాలన్నారు.

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 103వ నెల సాహితీ సమ్మేళనం స్థానిక శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం ఘనంగా జరిగింది. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి నిర్వహణలో సంస్థ సభ్యులు కవులు, రచయితలు అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని కవితలు చదివారు. కార్యక్రమంలో బగాది వెంకటరమణ, కనుగల సత్యం, వాండ్రంగి కొండలరావు, డిప్యూటీ కలెక్టర్ తులాల సవరమ్మ, బారువ కోమలరావు, కుప్పిలి త్రినాథరావు, ఎం.శ్రీనివాసరావు, కిల్లాన శ్రీనివాసరావు, తోట గోపాలరావు, ఇద్ది పాపయ్య, ఈశ్వరరావు, సత్యానందం, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.


కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు

రేపటి నుంచి వెంకన్న ఆలయ వార్షికోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ 15వ వార్షికోత్సవాలు ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు లోకనాథం నందికేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



జి.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011–2012లో పదో తరగతి చదివిన విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

– రణస్థలం

సైబర్ లా పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇటీవల కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకొని సీనియర్ న్యాయవాది, జిల్లా బీసీ న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు తెలుగు–ఇంగ్లీష్ భాషల్లో రాసిన సైబర్ లా పుస్తకాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి పిట్ట దామోదర్, కార్యవర్గ సభ్యులు జి.వనజాక్షి, న్యాయవాదులు మామిడి క్రాంతి, వాన కృష్ణచంద్, మూర్తి, పాలిశెట్టి మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శ్రీకాకుళం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు కేంద్రమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తంగి శివప్రసాద్, ప్రతినిధులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి

క్లుప్తంగా

గడ్డివాములు దగ్ధం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని రావివలస గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం సంభవించింది. సిరుగుడి నారాయణప్పారావు అనే రైతుకు సంబంధించిన మూడు గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు


పూజలు అందుకుంటున్న లలితాదేవి అమ్మవారు

ఎచ్చెర్ల: మండలంలోని దోమాం పంచాయతీ కుంచాలకుర్మయ్యపేటలోని లలితాదేవి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వంశికుమార్‌శర్మ ఆధ్వర్యంలో పాలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త నర్సింగరెడ్డి, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మురపాకలో పారిశుద్ధ్య పనులు


చెత్తను తొలగిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. చెత్తను తొలగించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. గ్రామ పెద్ద పెయ్యల లక్ష్మణరావు మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా కుండీల్లో వేయాలన్నారు.

చురుగ్గా పెద్దపాడు విస్తరణ పనులు


పెద్దపాడు రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, లైన్లు

అరసవల్లి: జాతీయ రహదారికి అనుసంధానమైన పెద్దపాడు ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల ప్రకారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ పనుల కోసం రూ.35 లక్షల నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా 45 విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ పనులు చకచకా జరుగుతున్నాయి. ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి, ఈఈ యోగేశ్వరరావులు పర్యవేక్షణలో ఈ 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి కానున్నాయి.

ఈవేమనకు సత్కారం


ఈవేమనను సత్కరిస్తున్న సాహితీలహరి నిర్వాహకులు

రణస్థలం: ప్రముఖ రచయిత, కవి వేమన–కవితామయం వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ మహమ్మద్ రఫీ (ఈవేమన)ని పార్వతీపురం సూర్యపీఠం సమావేశ మందిరంలో సాహితీ లహరి, మంచిపల్లి సేవా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆదివారం సత్కరించారు. ఇటీవల ఉగాది పురస్కార సాహిత్య కార్యక్రమంలో భాగంగా ఈవేమన కవితలకు మెచ్చి బహుమతి అందజేశారు. సాహితీలహరి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, కేంద్ర బాల సాహిత్య పురస్కార గ్రహీతలు నారంశెట్టి ఉమామహేశ్వరరావు, బెలగాం భీమేశ్వరరావు, కవి జాషువా పురస్కార గ్రహీత గంటేడ గౌరునాయుడు, కార్యక్రమ నిర్వాహకుడు మంచిపల్లి సారధి పాల్గొన్నారు.

నేతాలమ్మ యాత్ర ప్రారంభం


నేతాలమ్మ నిజస్వరూపం

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి గ్రామంలో నేతాలమ్మ 27వ యాత్ర మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 15వ తేదీ వరకు అమ్మవారికి ప్రతిరోజూ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

రణస్థలం: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు, శిక్షణలు, ర్యాలీలు నిర్వహిస్తామని రణస్థలం అగ్నిమాపక అధికారి పైల అశోక్ ఆదివారం తెలిపారు. 14న అగ్నిమాపక కార్యాలయంలో ప్రదర్శన, 15న రామాంజనేయ థియేటర్, తహసీల్దార్ కార్యాలయం జంక్షన్, రిలయన్స్ మార్టు, 16న లక్ష్మీనగర్ అపార్ట్‌మెంట్, 17న ఎస్ఈఆర్ స్కూల్, 18న ఏపీటోరియా, యూబీ పరిశ్రమల్లో, 19న రణస్థలం సీహెచ్‌సీ, పైడిభీమవరం గ్లోబెల్ హెల్త్ క్లీనిక్ వంటి ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 20న అగ్నిమాపక కార్యాలయంలో సెమినార్, వీడియో ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు.

ప్రజల్లోకి పార్టీ సిద్ధాంతాలు


పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు

గార: ప్రజా సమస్యల పరిష్కార వేదికగా పార్టీ కార్యాలయం నిలవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. ఆదివారం పోర్టు కళింగపట్నం (కె. మత్స్యలేశం)లో మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పైడి వేణుగోపాలం, అట్టాడ రవిబాబ్జీ, బిర్లంగి ఉమామహేశ్వరరావు, చల్ల వెంకటేశ్వరరావు, అట్టాడ రవిబాబ్జీ, పండి యోగీశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షురాలు మైలపల్లి లక్ష్మీ జనార్దనరావు పాల్గొన్నారు.

దత్తాత్రేయునికి తైలాభిషేకం


స్వామికి తైలాభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కొత్తబ్రిడ్జి వద్ద చిం దత్తనాథ క్షేత్రంలో చైత్రమాసం రెండో ఆదివారం సందర్భంగా దత్తాత్రేయునికి తైలాభిషేకాలు జరిగాయి. అనంతరం దత్తహోమం నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గవర గోవిందరావు, సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పెద్దబరాటం వీధి డీసీసీ కార్యాలయం సమీపంలోని శ్రీరామమందిరం వద్ద శ్రీఆదివారం అన్నదానం నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీరామ మందిర కమిటీ, డీసీసీ వివేకానంద ఆర్థిక సౌజన్యంతో నిర్వహించిన వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు బరాటం రాము, కోరాడ చిన్నారావు, బరాటం సాయిరాజ్, రాజు, బరాటం రమణ, బరాటం సన్యాసిరావు, కల్లేపల్లి చిట్టిబాబు, పాలిశెట్టి శ్రీను, గజ్జల రాజు, వడ్డి శ్రీరంగనాయకులు, జి.రాజేశ్వరరావు, బలగ వీరన్న ఆచారి, యర్రయ్య, రమణ, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం ర్యాలీ


తెలుగు బాప్టిస్టు చర్చిలో ఈత కొమ్మలతో ప్రదర్శన


క్రిస్టియన్ వర్షిప్ సెంటర్‌లో గీతాలాపన

శ్రీకాకుళం కల్చరల్: ఏసుప్రభువును శిలువ వేసిన గుడ్‌ఫ్రైడే ముందు వచ్చే ఆదివారాన్ని క్రైస్తవులు మట్టల ఆదివారంగా భావిస్తూ పలు చర్చిల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. చిన్నబజారులోని తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఏసుక్రీస్తు వేషధారణలో ఓ భక్తుడు శిలువను మోశారు. చిన్నారులు, మహిళలు పెద్దలు ఈత కొమ్మలను వెంట తీసుకొచ్చారు. కార్యక్రమంలో సంఘ పాస్టర్ కె.జెస్ ప్రేమ్‌కుమార్, డీఎల్‌బీఎల్ కుమార్, వై.సునీల్, ఎల్.చిట్టిబాబు, పాల్, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

- మహిళా కళాశాల రోడ్డులోని క్రిస్టియన్ వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా జరిగింది. ఏసుక్రీస్తును స్తుతి చేస్తూ ఆరాధకులు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పాస్టర్ జోసెఫ్, నిస్సీ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని కీస్టోన్ చర్చి ఆధ్వర్యంలో పాస్టర్ జోయల్ ఆధ్వర్యంలో చర్చిని ఈత కొమ్మలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న ట్రినిటీ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో పాస్టర్ జాకబ్ అధికారి నేతృత్వంలో క్రైస్తవులు ఈతకొమ్మలతో ర్యాలీ నిర్వహించారు. అఫీషియల్ కాలనీలోని సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి పాదర్ ప్రభాకర్, క్రైస్తవులు పాల్గొన్నారు. పాత శ్రీకాకుళంలోని ఆంధ్రా బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో పాస్టర్ డాక్టర్ రెవరెండ్ లోపింటి ప్రకాష్‌రావు నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని అప్పర్ రూం చర్చి పాస్టర్ కె.సుజ్ఞానరావు, కె.వెస్లీ సుజ్ఞాన్ నిర్వహణలో మట్టల ఆదివారం సందర్భంగా ర్యాలీ, క్రీస్తు గీతాలను ఆలపించారు.


ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఉత్తమ విద్యా సంస్థగా ఎస్ఈఆర్


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఈఆర్ స్కూల్ డైరెక్టర్ తేజ

రణస్థలం: ఉత్తరాంధ్రలోనే విలువలతో కూడిన ఉత్తమ విద్యా సంస్థగా ఎస్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ రాణించాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆకాంక్షించారు. మండలంలోని బంటుపల్లిలో గల ఎస్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర మంత్రి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు పేరున రణస్థలంలో డిజిటల్ లైబ్రరీ పెడతామన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ఎస్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతున్నాయన్నారు. నీట్, జేఈఈ తరహా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా తరగతుల నిర్వహణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం, విజయనగరం ఎంపీలు ఎం.శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎస్ఈఆర్ స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవాలు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సింగుపురంలో హటకేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుబా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎర్రటి వస్త్రాలు ధరించి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని సందడి చేశారు. ముందుగా కొండమ్మ హటకేశ్వర స్వామి ఉయ్యాల మండపంలో స్వామివారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


దుబా కార్యక్రమంలో భక్తులు

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని వరం వీధిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి , హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో బలగ బుచ్చిపేటలో ప్రచారం ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. యోగి ప్రబోనంద యోగ పీఠం స్థాపకులు ఆచార్య ప్రబోధానంద యోగేశ్వర స్వామి రచించిన 100 ఆధ్యాత్మిక రచనలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్, సంతోష్‌కుమార్, ఈశ్వరలాల్, గిరి, అప్పన్న, రాంబాబు, సుధాకర్, దుర్గారావు, సంతు, లావణ్య, రమ్య పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని నిమ్మవానిపేట గ్రామంలో త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సత్రం కమిటీ సభ్యులు ఆదివారం భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. వేదిక సత్రం కమిటీ అధ్యక్షుడు జనార్దనరావు మాట్లాడుతూ హైందవ ధర్మం, భగవద్గీతపై గ్రామాల్లో ప్రచారం చేస్తున్నామన్నారు. నైతిక విలువలతో కూడిన జీవనంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ధర్మమార్గంలో నడవాలి

శ్రీకాకుళం కల్చరల్ : ప్రతిఒక్కరూ ధర్మమార్గంలో నడవాలని, శ్రీరాముడు జీవుడిలోని కామం తొలగించారని, అదే అవతార ప్రయోజనమని నిష్ఠల నర్సింహమూర్తి అన్నారు. ఆదివారం నగరంలోని ఉపనిషన్మందిరంలో 'రామాయణ రహస్యాలు' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. అనంతరం వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో నారాయణమూర్తి, కోమలరావు, పి.పతంజలిశాస్త్రి, విశ్వేశ్వరరావు, పెద్ది ఈశ్వరరావు, ప్రకాశరావు, శ్రీమన్నారాయణ, పట్నాయక్, సరస్వతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


నరసింహమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

పశువుల వ్యాన్ సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను ఆదివారం ఎచ్చెర్ల పోలీసులు పట్టుకున్నారు. కుశాలపురం బైపాస్ కూడలిలో ఈ వాహనాన్ని సీజ్ చేశారు. ఎటువంటి అనుమతి పత్రాలను చూపకపోవడంతో కేసు నమోదు చేశారు. 18 పశువులను విజయనగరం గోశాలకు తరలించారు.